క్లుప్తంగా

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



గోపాల్‌పేట: మండల కేంద్రంతో పాటు తాడిపర్తి, పొలికెపాడు, బుద్దారం, లక్ష్మీతండా, పాటిగడ్డతండాలో కొనుగోలు కేంద్రాలను డీపీఎంలు బాషా, అరుణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూకాల్లో ఎటువంటి ఇబ్బందులు, తేడాలు కనిపించినా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈసారి ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా బాలకృష్ణ

అమరచింత: మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా అమరచింత పట్టణానికి చెందిన బాలకృష్ణ అనే విద్యార్థి శుక్రవారం నామినేషన్ సమర్పించారు. రాష్ట్రంలో చదువుకున్న నిరుద్యోగులకు త్వరితంగా ఉద్యోగాలు వస్తాయని ఆశ పడ్డామని, పదేళ్లలో నిరుద్యోగులు ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల గొంతుకను చట్టసభలో వినిపించే నాయకులే కరువయ్యారని అసహనం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటున్నాని తెలిపారు. తమకు మద్దతు ఇచ్చి నిరుద్యోగులకు బాసటగా ఉండాలని ఓటర్లను అభ్యర్థించారు.

బొడ్రాయి పండుగకు ముస్తాబు



అమరచింత: పట్టణంలో నిర్వహించే బొడ్రాల పండుగ సన్నాహక కార్యక్రమాలు మొదలయ్యాయి. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో తోరణాలు ఏర్పాటు చేసి విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు పట్టణంలోని తొమ్మిది ప్రాంతాల్లో బొడ్రాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించనున్నారు. దీంతో పట్టణంలో పండుగ వాతవారణం నెలకొంది. పట్టణ ప్రజలు ఉత్సవాలకు తమ వంతు సహకారం అందించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ధన్వంతరికి ఘన నివాళి



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో శుక్రవారం ధన్వంతరి జయంతిని ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు బెన్నూరు ఆశన్న ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆశన్నతో పాటుగా సామాజిక కార్యకర్త కమ్మరి గోపి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ కులంలో పుట్టినప్పటికీ దేశంలో మొట్టమొదటగా వైద్యసేవలను అందించిన వ్యక్తి ధన్వంతరి అన్నారు. దేవాదాయ శాఖలో ఉన్న కమిటీల్లో ఒక సభ్యుడిగా నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంజనేయులు, ఆనంద్, శేఖర్, హరిప్రసాద్, నరహరి, బాలు, రవి, మోహన్ పాల్గొన్నారు.

ఓటు హక్కు మన బాధ్యత



ఆత్మకూర్: ఓటుహక్కు మన జన్మ హక్కుగా, బాధ్యతగా భావించాలని ఈవిషయాన్ని కుటుంబ సభ్యులకు, గ్రామాల్లో చాటిచెప్పాలని ప్రిన్సిపాల్ డీఎస్ రాజేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఓటు హక్కు గురించి వివరించారు. ఒక్క ఓటు తమ జీవితాలను మారుస్తుందని, ప్రజలకు మేలు చేసే నాయకుడిని ఎంపిక చేస్తుందన్నారు. ఓటుకు ఉన్న ప్రాధాన్యత గురించి క్లుప్తంగా వివరించారు. ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యవర్ధన్‌రెడ్డి, టీజే విశ్వేశ్వర్, కురుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

అమరచింత: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని మక్తల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ గీతకార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం మక్తల్‌లో వాకిటి శ్రీహరి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, ఆయూబ్‌ఖాన్, మహంకాళి విష్ణు, జుబేర్ అహ్మద్, అక్కల అంజిగౌడ్, రవికాంత్, చిన్నరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యం అందేనా?

- లక్షకు పైగా జీవాలు ఉన్నా సిబ్బంది నియామకంలో నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు, కాపరులు
- పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా దర్శనమిస్తున్న మండల పశువైద్య కేంద్రం

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో లక్షకు పైగా మూగజీవాలు ఉన్నా.. వాటి వైద్య వసతుల కోసం ఏర్పాటు చేసిన పశువైద్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో సరైన సిబ్బంది అవసరమైన మందులను సమకూర్చడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో మూగజీవాలకు వైద్యం అందక పాడి రైతులు, కాపరులు నానా అవస్థలు పడుతున్నారు. అసంపూర్తి భవనాల్లో చాలీ చాలని వసతులతో ఉన్న కొద్దిపాటి వైద్య సిబ్బంది కాలాన్ని వెల్లదీస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వైద్య వసతులు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మండలంలో..

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 1,05,411 మూగజీవాలు ఉన్నాయి. అందులో ఆవులు 5,570, గేదెలు 3,525, గొర్రెలు 85,291, మేకలు 4,303, పందులు 722, కుక్కలు 1,800, కోళ్లు 4,200 ఉన్నాయి. వీటికి అనుగుణంగా మండలంలో సరైన వైద్య సిబ్బంది లేకపోవడంతో జీవాలకు సరైన సమయంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో రూ.వేలు ఖర్చు చేస్తూ ప్రైవేట్ మెడికల్ షాపులకు పరుగులు తీస్తున్నారు.

వైద్యాధికారులు లేక..

మండల కేంద్రంలో ప్రధాన పశువైద్య కేంద్రంతో పాటు కల్వరాల, వీపనగండ్ల, సంగినేనిపల్లి గ్రామాల్లో ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో వీపనగండ్ల, కల్వరాల గ్రామాల్లోని పశు వైద్యశాలలో ఏళ్ల తరబడి వైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు, రికార్డు అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నా వాటి నియామకంపై ఉన్నతాధికారులు దృష్టి సారించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

కనీస వసతులు కరువు

సంగినేనిపల్లిలోని పశువైద్య ఉపకేంద్రం ఐదేళ్లుగాగా మూతపడి దర్శనమిస్తుంది. కల్వరాలలో వైద్యాధికారి లేకపోవడంతో అరకొర వసతులతో కార్యాలయం కొనసాగుతుంది. మండల కేంద్రంలోని ప్రధాన పశువైద్యాధికారి కార్యాలయం నిర్మాణం కోసం నిధులు లేక అర్ధాంతరంగా భవన నిర్మాణం నిలిచిపోయింది. దీంతో ఒకే గదిలో మందులు, వెటర్నరీ సిబ్బంది ఉంటూ కాలాన్ని వెల్లదీస్తున్నారు.

సిబ్బందిని నియమించాలి



మండల కేంద్రంలోని ప్రధాన పశు వైద్యశాలలో ప్రధాన వైద్యాధికారి రెండేళ్లుగా లేకపోవడంతో పశువులకు సరైన వైద్యం అందడం లేదు. వైద్య సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు ఎన్నోమార్లు విన్నవించినా స్పందించడం లేదు. మూగజీవాల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదు.

– అంజనేయులు, పాడి రైతు, వీపనగండ్ల

ప్రైవేట్ షాపులకు..



మూగజీవాలకు వైద్యం అందించేందుకు ప్రభుత్వ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో కొద్దిపాటి వైద్యానికి రూ.వందలు ఖర్చు చేయాల్సి వస్తుంది. తమ గ్రామంలో పశువైద్య ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేసి అవసరమైన సేవలు అందించాలి.

– రావుల రవీందర్‌రెడ్డి, సర్పంచ్, వల్లభాపురం

రైతులకు ఇబ్బందులు కలగకుండా..



మండలంలో సరైన పశువైద్య సిబ్బంది లేకున్నా రైతులకు, కాపరులకు ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాన్ని సకాలంలో చేరుకుంటూ నట్టల నివారణ మందులు, కృత్రిమ గర్భధారణ, వ్యాధి నిరోధక టీకాలు అందజేస్తున్నాం. అవసరమైన చోట సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం.

– కె శ్యాం, ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి, వీపనగండ్ల

ఆదరిస్తాం .. అండగా ఉంటాం



వనపర్తిలో మంత్రి నిరంజన్‌రెడ్డికి గుమ్మడికాయతో దిష్టి తీస్తున్న మహిళ

వనపర్తి: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని మంత్రి నిరంజన్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని గాంధీనగర్, ఇందిరా కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మంత్రికి గుమ్మడికాయలు, మంగళహారతులతో ఆహ్వానం పలికారు.

మైనారిటీల సంక్షేమానికి కృషి

వివక్షకు గురవుతున్న మైనార్టీల సంక్షేమానికి కృషి చేసింది కేసీఆర్ సర్కారేనని సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మైనార్టీలతో కలిసి జామామజీద్, మదర్సా మజీద్‌లను సందర్శించారు.

మేఘారెడ్డి కాదు.. దగారెడ్డి

సబ్ కంట్రాక్టర్ల పేరుతో నమ్మిన వారిని దగా చేసిన ఘనత కాంగ్రెస్ అభ్యర్థి మేఘారెడ్డికి దక్కుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డబ్బులిచ్చి మేస్త్రీతో ఇల్లు కట్టించుకుంటే ఆ ఇల్లు మేస్త్రీ సొంతం కాదనే విషయం తెలుసుకోవాలని, ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి వ్యవహారం సాగునీటి కాల్వల విషయంలో అలాగే ఉందని ఎద్దేవా చేశారు. కోడేరు ఒగ్గు పర్వతాలు యాదవ్‌ని నిండా ముంచింది మేఘారెడ్డి కాదా అని ప్రశ్నించారు.

ఖిల్లాఘనపురం: ఈ నెల 30వ తేదీన జరిగే ఎమ్మెల్యే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కుమార్తె డాక్టర్ ప్రత్యూష కోరారు. శుక్రవారం ఉదయం మండలంలోని మల్కాపురంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలు, యువకులు, పెద్దలను ప్రత్యేకంగా కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, సర్పంచ్ మణెమ్మ, రాములు, రవీందర్, వెంకట్‌రెడ్డి, రాములు, మహేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వనపర్తి టౌన్: హైదరాబాద్‌లో ఈనెల 15, 16 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు వనపర్తి పట్టణంలోని చాణిక్య ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఆయా రంగాల్లో ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్ షాజుపాల్ అభినందించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో భాగంగా చిత్రలేఖనంలో సేవ్ వాటర్, సేవ్ ఎర్త్‌లో ఎస్.అక్షర, పర్యావరణ పరిరక్షణలో మట్టి గణపతులపై సాత్విక, ఏకపాత్రాభినయంతో సాయిబవజ్ఞతో పాటు తదితరులు పలు అంశాల్లో ప్రతిభ చాటడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటుగా అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షాజుపాల్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబర్చి వనపర్తికి, చాణిక్య పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చేలా విద్యార్థులకు సృజనాత్మకత కలిగిన అంశాలపై అవగాహన పెంపొందిస్తున్నామన్నారు.

‘ఓట్లడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది’



సింగోటం ఆలయంలో పూజలు చేసిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: అభివృద్ధి పనులు చేశాం.. ప్రజలను ఓట్లడిగే హక్కు బీఆర్ఎస్ పార్టీకే ఉందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొల్లాపూర్‌లో మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 11:30 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట ఎంపీ రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు కురువ విజయ్‌కుమార్, రంగినేని అభిలాష్‌రావు, గౌరారం వెంకటరెడ్డి, ధారాసింగ్‌లు ఉన్నారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వేలాదిగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తొమ్మిదిన్నరేళ్లు అధికారం దర్పం అనుభవించి, ఇక్కడ సీటు దొరకకపోవడంతో ఇంకో పార్టీలోకి పోయిన జూపల్లి కేసీఆర్‌ను విమర్శించడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ లేదా ఏదైనా పదవి ఇచ్చిఉంటే ఇక్కడే ఉండేవాడన్నారు. కాంగ్రెస్ నాయకులు కర్ణాటక మోడల్ అంటూ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో వాగులపై వంతెనలు, పోడుభూములకు పట్టాలు, రహదారుల నిర్మాణాలు ఎన్నో చేపట్టామన్నారు. నేషనల్ హైవే, సోమశిల వంతెన సాధనలో తనతో పాటు ఎంపీ రాములు పాత్ర ఎంతో ఉందన్నారు.

మూడోసారి విజయ ఢంకా

ఎంపీ రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం, కొల్లాపూర్‌లో రెండోసారి హర్షవర్ధన్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుస్తారని జోస్యం చెప్పారు. హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ శ్రేణులు నిబద్ధతతో పనిచేయాలని మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు.

పెద్దకొత్తపల్లి/కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి పెద్దకార్పాముల గ్రామానికి చెందిన 80 మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో చేరారు. బీఎస్పీ రాష్ట్ర నాయకుడు పసుపుల రామకృష్ణను ఎంపీ రాములు పార్టీలోకి ఆహ్వానించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పాన్‌గల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించి వారి ఇబ్బందులను తొలగించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జీపీల్లో పనులు చేస్తున్నా కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. సమ్మె సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదన్నారు. పెండింగ్ వేతనాలు, ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పందించకుంటే కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



ఆత్మకూర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 30న జరుగనున్న నేపథ్యంలో సీఐ కేఎస్ రత్నం, ఎస్ఐ నరేందర్, స్పెషల్ బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీచౌక్, చెరువుకట్ట వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. నగదుకు సంబంధించిన ధృవపత్రాలు ఉండాలని సూచించారు.

48 మద్యం సీసాలు పట్టివేత

పాన్‌గల్: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బహదూర్‌గూడెం స్టేజీ వద్ద వాహనాల తనిఖీలో తెల్లరాళ్లపల్లితండాకు చెందిన కేతావత్ రవి ద్విచక్ర వాహనంపై రెండు కాటన్ల (48 బాటిళ్ల)ఐబీ విస్కీ క్వార్టర్లను అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుబడిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

అహంకారానికి, ఆత్మగౌరవానికి మధ్య పోరు



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి/ఖిల్లాఘనపురం: ప్రస్తుత ఎన్నికల్లో పోటీ మంత్రికి తనకు కాదని, అహంకారానికి ఆత్మగౌరవానికి మధ్య అని ప్రజలు గుర్తించి ఓటుతో తీర్పునివ్వాలని వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం చివరి రోజున వేలాది మంది జన సమీకరణతో నామినేషన్ దాఖలు చేసిన ఆయన ఎద్దుల బండిపై పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ చిన్నారెడ్డి, మాజీ ఎంపీ మల్లురవితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే మీ ఇంటి వద్ద పెద్దజీతగాడిలా పని చేస్తానన్నారు. అంతకంటే ముందు మాజీ మంత్రి డాక్టర్ జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల పాటు అవినీతిరహితంగా వనపర్తి పాలించామని, ఇప్పుడు నియోజకవర్గంలో అక్రమాలు పెరిపోయాయని ధ్వజమెత్తారు. అంతకముందు మేఘారెడ్డి ఖిల్లాఘనపురంలో మండలంలోని గట్టుకాడిపల్లి లక్ష్మీఅలవేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో కార్యకర్తలు ఆయనను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, క్యామ వెంకటయ్య, వెంకటేశ్వర్ రావు, శ్యాంసుందర్‌రెడ్డి, సతీష్‌కుమార్ ఉన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: వైద్యుల సూచనల మేరకు టీబీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రేమద్దుల, గోప్లాపూర్ గ్రామాల్లో టీబీ వ్యాధిగ్రస్తుల అనుమానిత సర్వే నిర్వహించి టీబీ వ్యాధి నివారణపై అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. అలసట, తలనొప్పి, బరువు తగ్గడం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, రెండు వారాలకు మించి దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడటం వంటి లక్షణాలు ఉన్న వారు తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోగం నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. క్షయ వ్యాధి (టీబీ) సోకిన వారు దగ్గినప్పుడు కానీ తుమ్మినప్పుడు గాలి ద్వారా ఎదుటివారికి వ్యాపిస్తుందని, అడ్డుగా చేతిరుమాలు పెట్టుకోవాలని కోరారు. అనుమానితుల నుంచి తెమడ సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోషమ్మ, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, నాగేశ్వరి, శాంతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. డ్రై డేలో భాగంగా మండల కేంద్రంతో పాటు రేమద్దుల, గోప్లాపూర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి పలు సూచనలు చేశారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెంది రోగాలు వస్తాయని, వారానికి ఒక్కసారి నిల్వనీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు. కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. నిల్వ నీటిలో దోమల నివారణ కోసం అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు.

ఉరేసుకొని మహిళ మృతి

ఖిల్లాఘనపురం: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని అంతాయపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అరుణ(22)కు కుటుంబ సభ్యులతో తరుచుగా గొడవలు జరిగేవి. ఈ క్రమంలో గురువారం సైతం గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన అరుణ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయమై అరుణ తల్లి మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీను తెలిపారు. అరుణకు భర్త నర్సింహగౌడ్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

నత్తనడకన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం



పిల్లర్లకే పరిమితమైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

అమరచింత: పట్టణంలో రూ.రెండు కోట్లతో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నిధులు మంజూరై రెండున్నరేళ్లు గడిచినా స్థల ఎంపికతో పాటు టెండర్ ప్రక్రియ పనులు వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు గతేడాది కిందట నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించినా ఇప్పటి వరకు పిల్లర్ల వరకే పనులు ఉండటంతో ఎప్పుడు పూర్తవుతాయో అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నిధులు మంజూరైన పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే పనులు అటకెక్కాయని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణంలో వారాంతపు సంత ప్రధాన రహదారిపై కొనసాగుతుంది. దీంతో వాహనాల రాకపోకలతో కూరగాయలు కొనేందుకు వచ్చే వినియోగదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులను పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ దీపావళి జరుపుకొందాం



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: కాలుష్య నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ దీపపు కాంతులతో వెలుగులు నింపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని మహిళా సంఘాల సభ్యులతో పాటు ప్రజలకు దీపావళి పండుగ గురించి అవగాహన కల్పించారు. దీపావళి రోజు చైనా టపాసులు కాల్చడం ద్వారా వాతవారణం కాలుష్యం స్థాయి పెరుగుతుందన్నారు. ప్లాస్టిక్‌ను ఎక్కువగా ఉపయోగించరాదని కోరారు. మట్టి ప్రమిదలు ఉపయోగించి ఇంటి ముందు దీపాలను వెలిగించి క్రిమికీటకాలను దూరం చేసుకోవాలన్నారు. దీంతో వాతావరణం రక్షించబడుతుందన్నారు. స్వచ్ఛతపై ప్రతి ఒక్కరూ మున్సిపల్‌కు సహకరించాలని, ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని ప్రతిజ్ఞ నిర్వహించారు.

అక్రమ కట్టడం కూల్చివేత

అమరచింత: మున్సిపాలిటీ అనుమతి లేకుండా రహదారిని ఆక్రమించి అక్రమంగా కంపౌండ్ వాల్ నిర్మించడం సరైంది కాదంటూ గోడను కూల్చి గేట్‌ను తొలగించామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. పట్టణానికి చెందిన నెలికొండి ఆరేందర్‌రెడ్డి తన ఇంటి ఎదుట అక్రమంగా కంపౌండ్ వాల్ నిర్మిస్తుండటంతో రహదారిపై రాకపోకలకు అంతరాయం కలుగుతుందని కాలనీ వాసులు ఫిర్యాదు ఇచ్చారు. దీంతో నిర్మాణ పనులను నిలిపివేయాలని అధికారులు నోటీసులు అందించారు. తమ ఆదేశాలను అతిక్రమించి నిర్మాణ పనులు చేపడుతుండటంతో శుక్రవారం సిబ్బందితో కలిసి కట్టిన గోడను కూల్చివేశామని కమిషనర్ తెలిపారు. పట్టణంలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

